# 11. అభిమాని

అంత ఉన్నతస్థానాన్ని అలంకరిస్తానని అతను కలలోకూడా తలవలేదు. పల్లెటూరి కర్షకుని కుమారుడుగా జన్మించిన జీన్ మేరిన్, "ప్లీడరీ" చదివేందుకు లాటిన్ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. అనేక హెూటళ్ళల్లో అతనికి ఇతర విద్యార్థుల పరిచయం కలిగింది. ఆ విద్యార్థులు బాగా తాగి, రాజకీయాలు చర్చించేవాళ్ళు. మేరిన్ వాళ్ళను గొప్పగా మెచ్చుకుంటూ, హోటల్ హోటల్‌కూ వాళ్ళను వెంటాడుతూ – వాళ్ళ ఖర్చునుకూడా తనే భరిస్తూ వొచ్చాడు.

కొన్నాళ్ళకు అతనికి "బార్"లో ప్రవేశం కలిగింది; కాని అతను పట్టిన కేసులన్నీ ఓడిపోసాగినయ్. ఇలావుండగా ఒకనాటి ఉదయం – లాటిన్ క్వార్టర్స్‌లోని తన పాత స్నేహితుడొకడు "డిప్యూటీ"గా నియమించ బడినట్టు– వార్తాపత్రికలో చదివాడు. పొమ్మంటే పోతూ, రమ్మంటే వస్తూ – నీచకార్యాల్ని చెయ్యటంలో వెనుదియ్యకుండా, ఎవరి దృష్టినీ ప్రత్యేకంగా ఆకర్షించలేని – విశ్వాసపాత్రమైన కుక్క పాత్రను మేరిన్ వెంటనే ధరించాడు. కొన్నాళ్ళకు పార్లమెంటు "డిప్యూటీ"ని మంత్రిపదవికి తీసుకుంది. అప్పుడే మేరిన్ స్టేట్ కౌన్సిల్‌లోని ఉద్యోగాన్ని సంపాయించగలిగాడు.

మొదట గర్వంతో అతని తల తిరిగిపోయింది. ప్రజలు తనను చూస్తూండగా – తను అనుభవించే ఆనందంకోసం అతను వీధులన్నిటినీ తిరగసాగాడు. తనను చూడగానే తన యీ కొత్తపదవి సంగతి ప్రజలు ఇట్టే గ్రహించితీరుతారనే గట్టినమ్మకం అతనిలో పాతుకుపోయింది. అతను వ్యాపారస్తుడితోకానీ, పత్రికలు అమ్మేవాడితో కానీ, గుర్రబ్బండి తోలేవాడితో కానీ మాట్లాడాల్సివొస్తే – ఎంత అసందర్భమైనా, "నాలాటి స్టేట్ కౌన్సిల్ ఉద్యోగి..." అని మొదలుపెట్టేవాడు.

అనుకోని యీ ఉన్నతపదవి - ఉద్యోగధర్మాల్నీ, యుక్తాయుక్త విచక్షణ జ్ఞానాన్నీ మరిచేటట్టు చేసింది. తన గొప్పను సూచించేందుకూ - తన పలుకుబడిని రూపించేందుకూ - అడక్కముందే సిఫారసు ఉత్తరాలు ఇవ్వటాన్ని అతను అలవాటు చేసుకున్నాడు. లేని స్వాతంత్ర్యాన్ని తీసుకొని - తనను ఉపయోగించుకోమని అందరివెంటా పడేవాడు. తనకుకాస్త పరిచయంగలవ్యక్తి రోడ్డుమీద కనిపిస్తేచాలు - అతన్ని పిలిచి, భుజం తట్టి, యోగక్షేమాల్ని విచారిస్తాడు. తనను అడక్కపోయినా, తనే ఇలా అంటాడు!

"నేను స్టేట్ కౌన్సిల్‌లో వున్నట్టు నీకు తెలుసుననుకుంటాను. ఏ విధంగానన్నా నేను నీకు ఉపయోగపడే అవకాశం వుంటే - నన్ను ఆజ్ఞాపించేందుకు ఆలోచించవొద్దు. ఈ వున్నత పదవిలో పలుకుబడి - ఎవరికైనా గొప్పమేలును తప్పకుండా చెయ్యగలదు..."

వెంటనే ఆ స్నేహితుడితో పక్కనేవున్న కేఫ్‌లోకివెళ్ళి, "బోయ్...కాగితం, కలం, సిరా - ఒక్కతావు కాగితం - ఒక్క సిఫారసు ఉత్తరానికి -చాలు!" అని ఆజ్ఞాపించేవాడు.

ఈ విధంగా సిఫారసు ఉత్తరాల్ని గుద్దెయ్యటంలో అతను ప్రవీణుడయ్యాడు. వాటిసంఖ్య రోజుకు పదీ, ఇరవై, యాభై కూడా ఉండేది. వాటన్నింటినీ అతను ఒకవేళ లేకుండా, ఒకచోటలేకుండా - కేఫ్ అమెరికన్‌లో, బిగ్‌నాన్స్‌లో, టార్టినిస్‌లో, కేఫ్ రైఖేల్‌లో, హెల్టర్‌లో, ఆంగ్లియాస్‌లో, నెపోలిటాన్‌లో - ఇంకా చాలా స్థలాల్లో గీకి పారేసేవాడు. వాటిని న్యాయాధికార్ల మొదలూ, మహా మంత్రివరకూగల ఉద్యోగస్తు లందరికీ రాసేవాడు. ఇలా అతను మహదానందంతో తనలో తను మురిసిపోతూ, హాయిగా కాలం గడపసాగాడు.

ఒకనాటి ఉదయం స్టేట్ కౌన్సిల్ ఆఫీసుకు పోతూండగా జల్లు పడనారంభించింది. బండిలో వెళ్దామనుకున్నాడు కాని - చూపుమేరదూరంలో బండేమీ కనిపించకపోవటంవల్ల - ఏమైనా కాలినడకనే వెళ్దామనే నిశ్చయానికి వొచ్చాడు. తుంపర పెద్దవానగా మారింది. కొంచెంసేపటికల్లా రోడ్ల మీద నీరు ధారాళంగా ప్రవహించసాగింది. కాలిబాటలన్నీ నీళ్ళమయ మయినయ్. మేరిన్ ఒక పోర్టికోకింద తలదాచుకోక తప్పింది కాదు. అంతకుముందే వెంట్రుకలు నెరిసిన ఒక ముసలి మతగురువు అక్కడ నిలబడివున్నాడు. స్టేట్‌కౌన్సిల్‌లో ఉద్యోగం రాకపూర్వం మేరిన్‌కు మతగురువులంటే అయిష్టత వుండేది. కాని అతి కష్టమైన సమస్యల్లో వారు తన సలహాకు వొచ్చినప్పుడు అతనికి "ఇష్టం" కలుగనారంభించింది.

వాన తీవ్రరూపాన్ని దాల్చింది. తడిసి ముద్దకాకుండా ఉండేందుకు వారు - గేటు కాపలావాడి పంచలోకి వెళ్ళారు. మేరిన్ మాట్లాడేందుకు వాచిపోతున్నాడు.

తన విలువను బైటపెట్టేందుకు తహతహలాడుతూ, చివరకు అన్నాడు: "ఏం వాన; ఏం గాలి."

ముసలివాడు తలతిప్పి, "ఔను-వెధవగాలి! మరీ పదిరోజులపాటు పారిస్‌లో ఉండి వెళ్దామని వొచ్చినవాళ్ళకు..." అన్నాడు.

"ఐతే మీరు గ్రామంనుంచి వొస్తున్నారా?"

"ఔను..."

"నిజమే! కొద్దిరోజుల పట్టణవాసంకోసం వొచ్చిన వాళ్ళకు మరీ ఇబ్బంది. ఏడాదంతా ఇక్కడే వుండే మాలాటి ఉన్నత్యోద్యోగులు దీనికి లెక్క చెయ్యరుకాని..."

మతగురువు జవాబు చెప్పలేదు. అతను వీధిలోకి చూడసాగాడు. వాన తగ్గనారంభించింది. ఆడవాళ్ళు ఏదన్నా దూకేందుకు గౌనును పైకిఎత్తి పట్టుకున్నట్టు - అతను పొడుగాటి తన కోటును పైకియెత్తి పట్టుకున్నాడు. మతగురువు ఉద్దేశాన్ని గ్రహించిన మేరిన్ అన్నాడు! "మీరు పూర్తిగా తడిసి పోతారు కొంచెంసేపు ఆగండి. వాన బాగా తగ్గిపోబోతోంది."

ముసలివాడు కాస్త ఆగి అన్నాడు : "నాకు చాలా పని ఉంది... చాలా అవసరమైన పని... అర్జంటు."

మేరిన్‌కు మతగురువుగారి అవసరమైన అర్జంటు పనిలో గొప్ప 'ఇంటరెస్టు' కలిగింది. అన్నాడు:" - మీరు ఎటువెళ్తారో నేను అడగవొచ్చా?"

కొంచెం అనుమానించి మతగురువు జవాబు చెప్పాడు:

"నేను రాయల్ పేలెస్ వైపు వెళ్తాను-"

"అలాగైతే - మీకు అభ్యంతరం లేకపోతే మీరు నా గొడుగులో రావొచ్చు. నేను స్టేట్‌కౌన్సిల్‌వైపుకు వెళ్తున్నాను. ఆఫీసులో నేనొక ఉద్యోగిని -" అన్నాడు మేరిన్.

ముసలివాడు తలఎత్తి ఒక్కసారి తన పరిచయస్తుణ్ని నిలువెల్లాచూసి, అన్నాడు: "థాంక్స్...నేను మీ దయను అంగీకరిస్తాను-"

మేరిన్ ముసలివాడి చెయ్యిపట్టుకొని నడవసాగాడు. దారిలో మేరిన్ మహా మంచి సలహాల్ని ఇవ్వసాగాడు.

"అక్కడ ఇనప స్తంభం వుంది. జాగర్త....బళ్ళచక్రాల విషయంలో జాగర్తగా వుండండి. నీళ్ళూ, బురదా బట్టల్ని ఖరాబు చేస్తయ్ - ఇతరుల గొడుగులు జాగర్త; గొడుగు చువ్వలు కళ్ళల్లో పొడుచుకుంటయ్...ఆడవాళ్ళ కన్న హానికరమైన జీవులు వుండరు. వాళ్ళు ఎవర్నీ, దేన్నీ లెక్కచెయ్యకుండా తోసుకువెళ్తారు. దారి అంతా తమదే ఐనట్టు తోవకూడా ఇవ్వకుండా తిరుగులాడుతారు. వీరికి సంస్కారం చాలా అవసరం అని తోస్తుంది..."

మేరిన్ పెద్దగా నవ్వసాగాడు.

మతగురువు జవాబు చెప్పలేదు. అతను కొంచెం వొంగి నడుస్తూ - తన బూట్స్, పొడుగాటి కోటూ పాడుకాకుండా కాపాడుకుంటున్నాడు.

మేరిన్ మళ్ళీ వాగసాగాడు:

"కులాసా కాలక్షేపానికి మీరు పారిస్ వొచ్చివుంటారనుకుంటాను-"

"లేదు...ఇక్కడ పనివుండి వొచ్చాను."

"ఓహో! మీది అవసరమైన పనా? అదేమిటో నేను అడగవొచ్చా? నేను మీకు ఏమైనా ఉపయోగిస్తే - నాకు చేతనైనంత సహాయం మీకు చేస్తాను."

మత గురువుకు అపరిమితానందమై మెల్లిగా గొణిగాడు: "అదివొక వ్యక్తిగతమైన స్వల్పవిషయం. మా బిషప్‌తోడి ఒక చిన్న పేచీ. అది మీకంత "ఇంటరెస్టింగ్‌గా" వుండదేమో?...ఇంటి వ్యవహారాల్ని గూర్చిన ఒక చిన్న కట్టుబాటు..."

మేరిన్ అన్నాడు : "స్టేట్ కౌన్సిల్‌కు వొచ్చేవన్నీ ఇలాటి విషయాలే! మీదికూడా అలాటిదే కనుక - ఇక మీరు నన్ను ఆజ్ఞాపించవొచ్చు."

"మీరు చెప్పింది నిజమే! నేను స్టేట్ కౌన్సిల్‌కే వెళ్తున్నాను. మీరు చాలా దయగలవారు. నేను - లెరిపారీ, శాలోన్, పెటిటి పాస్ గార్లను దర్శించాలి-"

మేరిన్ అలాగే - నిలబడిపోయి అన్నాడు : "వాళ్ళందరూ నాకుసాటి ఉద్యోగస్తులు. చాలా మంచివాళ్ళు. నాకు ముఖ్య స్నేహితులు. వాళ్ళ ముగ్గురికీ నేను సిఫారసు ఉత్తరాల్ని ఇస్తాను. వాటి మీద మీకు పని జరిగి తీరుతుంది-"

మిక్కిలి కృతజ్ఞతను సూచించే కంఠంతో మతగురువు మేరిన్‌ను "థాంక్" చేశాడు. మేరిన్‌కు తలతిరిగే సంతోషమైంది.

"మీకు పనికాగానే నన్ను మెచ్చుకుంటారు. మన శక్తిని చూద్దురుకాని. ఇంత స్వల్పవిషయం - మూడు నిమిషాల్లో పూర్తవుతుంది-"

ఇద్దరూ స్టేట్ కౌన్సిల్ ఆఫీసు జేరారు. మేరిన్ మత గురువును తన ప్రైవేటుగదిలోకి తీసుకువెళ్ళి - ఒక కుర్చీ చూపి, తను టేబిల్ దగ్గర కూర్చొని సిఫారసు ఉత్తరాల్ని గీకసాగాడు.

"ప్రియ మిత్రమా!

మిక్కిలి యోగ్యుడూ, సజ్జనుడూ, మనకు బాగా కావాల్సినవాడూ ఐన - మతగురువు..." ఆగి మేరిన్ అడిగాడు : 'మీ పేరేమిటన్నారూ?'

"సెనిట్యూర్-"

మేరిన్ మళ్ళీ రాయనారంభించాడు.

"...సెనిట్యూర్ మహాశయుడు - ఒక చిన్న విషయంలో (అది ఆయనే మీకు విపులంగా చెప్తారు) మీ సహాయాన్ని కోరుతున్నారు. మీకు సాధ్యమైనంతవరకూ సహాయం చేస్తారని నమ్ముతున్నాను...ఇట్లు"

ఇలా మూడు ఉత్తరాల్నీ పూర్తిచేసి, ముసలివాడికి ఇచ్చాడు. ముసలివాడు - మేరిన్ తరతరాల్నీ దీవిస్తూ- కృతజ్ఞతతో నమస్కరించి సంతోషంతో వెళ్ళిపొయ్యాడు.

* * *

మేరిన్ పని పూర్తిచేసుకొని, ఇంటికి వెళ్ళి మిగతా రోజంతా విశ్రాంతి తీసుకొని - హాయిగా నిద్రపొయ్యాడు. మర్నాటి ఉదయం సంతోషంతో మేల్కొని, వార్తా పత్రికల్ని చదవ నారంభించాడు.

మొదటి పత్రికలో ఇలా చదివాడు :

"మన మత గురువులు - రాజోద్యోగులు.

మన మత గురువుల దుష్ప్రవర్తనను లోగడ మేము సూచిస్తూ వొచ్చాం. సెనిట్యూర్ అనే ఒక మత గురువు ప్రవర్తన (దాన్ని ఇక్కడ సూచించేందుక్కూడా వీల్లేదు) అనుమానాస్పదంగా ఉంటూ వొచ్చింది. అతను మామూలు మత గురువు వేషధారణలో వున్న రాజద్రోహిగా గుర్తింపబడ్డాడు. ఇలాటివే ప్రచురణార్హం కాని అనేక దుర్మార్గాలు చేశాడని బిషప్‌చేత తొలగింప బడ్డాడు. ప్రభుత్వంమీద తిరుగుబాటు యత్నాలు చేశాడనే నేరం మీద విచారణకు గాను పారిస్‌కు పిలువబడ్డాడు. ఇక్కడ - పారిస్‌లో - ఒక స్టేట్ కౌన్సిల్ ఉద్యోగి మేరిన్ మహాశయుణ్ని వెతికిపట్టుకో గలిగాడు. ఈ మేరిన్ మహాశయుడు దొంగ మతగురువుగార్ని బాగా ఆదరించి, అభిమాన పూర్వకంగా గౌరవించి - మాంచి ఘాటైన సిఫారసు ఉత్తరాల్ని, తన స్నేహితులకూ, ఇతర రాజోద్యోగులకూ రాసి ఇవ్వటంలో ముందంజవేశాడు. ఈ విషయంలో మంత్రిగారి విచారణ అత్యవసరమని విన్నవిస్తున్నాం."

మేరిన్ పక్కలోనే ఎగిరిపడి, వెంటనే దుస్తులు వేసుకొని - కలత హృదయంతో పెటిటిపాస్ దగ్గరకు వెళ్ళాడు.

పెటిటిపాస్ అడిగాడు; "పేరుబడ్డ దొంగవెధవకు సిఫారసు ఉత్తరం ఎందుకు ఇచ్చినట్టూ?"

సగం చచ్చి మేరిన్ మాటల్ని వెతుక్కుంటూ అన్నాడు :

"అసలు విషయాన్ని నన్ను చెప్పనీ - వాడు నాకు బాగా టోపీవేశాడు. పైకిచాలా మర్యాదస్తుడిలాగు, పవిత్రుడివలె కనిపించాడు. నన్నొక మూర్ఖుణ్ని చేశాడు. వాణ్ని

శిక్షించాలి బాగా శిక్షించాలి. కఠినశిక్ష విషయంలో నేనే ఉత్తరం రాస్తాను. ఎవరికిరాస్తే మన పని అవుతుందో చెప్పు. పారిస్‌లోని ఆర్చ్‌బిషప్‌కు రాస్తాను – అంతే!"

పెటిటిపాస్ టేబిల్ మీద కూర్చొని, వెంటనే ఇలా రాయసాగాడు :

"అయ్యా!

సెనిట్యూర్ అనే అబద్ధకుడి మాయమాటల్లోపడి నేను గౌరవాన్నంతటినీ చెరుచుకుంటూ, మోసపోయి, ఒక సిఫారసు ఉత్తరాన్ని రాసేందుకు సాహసించినందుకు..."

ఉత్తరం పూర్తయ్యాక పెటిటిపాస్ స్నేహితుడివైపు తిరిగి అన్నాడు : "ఇక ముందు ఎలాటివారికైనా, ఎట్టి సందర్భంలోనన్నాసరే – సిఫారసు ఉత్తరం రాయకుండా ఉండేందుకు ఇదొక గుణపాఠం...తెలిసిందా?